క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



జడ్చర్ల: మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమ్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం టీఎన్‌జీఓ భవన్‌లో టీఎంఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి సమస్యల పరిష్కారానికి కార్యాచరణను రూపొందిస్తామన్నారు. జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఫయాజొద్దీన్, కార్యదర్శిగా వసీంలను ఎన్నిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొహిత్, ఉపాధ్యక్షుడు బాలరాజు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు షేక్‌రఫీ, రాజేశ్, ముఖేష్, ఉదయ్ ఉన్నారు.

కరాటేలో సత్యం ప్రతిభ



జడ్చర్ల: దివంగత నటి విజయనిర్మల స్మారకార్థం ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేట ఎన్ఈసీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ పోటీల్లో మండలంలోని నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన సత్యం ప్రతిభ కనబరిచాడు. సినీ నటుడు నరేష్ చేతుల మీదుగా బ్లాక్ బెల్టును అందుకున్నాడు. తనను ప్రోత్సహించిన మాస్టర్లకు సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గండేడ్/మహమ్మదాబాద్: గడ్డి మందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గండేడ్ మండలంలోని పగిడియాల్ గ్రామానికి చెందిన పెంటయ్య ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12.15గంటలకు ఇంట్లో గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. నవాబుపేటకు చెందిన రాఘవేందర్, భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంపై కొత్తకోట వైపు నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. మూసాపేట స్టేజీ దాటిన తర్వాత రెండు వాహనాలు వెనుక నుంచి రావడంతో బైక్‌ను కొంత రోడ్డు కిందకు దింపాడు. దీంతో మట్టిరోడ్డుపై ఉన్న గుంతల మూలంగా బైక్ కింద పడటంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు.

సంతలో ఉచిత భోజనం

నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం సంతకు వచ్చే జనాలకు ఉచిత భోజనం అందించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి చేపట్టిన ఉచిత భోజనాల కార్యక్రమం మూడు నెలలు పూర్తి చేసుకుంది. ఉచిత భోజనం కార్యక్రమం 12వ వారంతో భోజనాలు చేసిన వారి సంఖ్య 5వేలకు చేరింది. ఈ కార్యక్రమం సంతకు వచ్చేవారికి చాలా ఉపయోగకరంగా మారిందని పలువురు అభిప్రాయ పడ్డారు.

మాలధారులకు సన్మానం

నవాబుపేట: శబరిమలైకి మండల కేంద్రం నుంచి మహా పాదయాత్రగా వెళ్లిన అయ్యప్ప మాలధారులు ఆదివారం తిరిగి వచ్చారు. మండల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. మండల కేంద్రంలో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించి స్వాగతం పలికారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడాన్ని రైతులు స్వాగతిస్తూ క్షీరాభిషేకం చేసినట్లు శెట్టిశేఖర్ తెలిపారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, గోవర్ధన్, సంతోషి, నిరంజన్, ఎస్‌టీగౌడ్, శ్రీనివాస్‌శర్మ, రాంచందర్, నారాయణ, అంజనేయులు, శ్రవణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో నీటిసమస్య తీవ్రం

మల్లెబోయిన్‌పల్లి వద్ద పాడైన మోటార్లు

- ఒకే మోటర్‌తో నీటి పంపింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్యపై కలెక్టర్ సమీక్ష



26వ వార్డులో ప్రైవేట్ ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీలో కొద్దిరోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైంది. పలు వార్డుల్లో పది రోజులుగా నీటి సరఫరాకు నోచుకోకపోవటంతో మహిళలు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ప్రారంభమయ్యాక నీటిసమస్య తలెత్తటం ఇదే తొలిసారి. మండలంలోని మల్లెబోయిన్‌పల్లి పంప్‌హౌజ్ ద్వారా మున్సిపాలిటీకి నీరు సరఫరా అవుతాయి. అక్కడి పంప్‌హౌజ్‌వద్ద మూడు మోటార్లకుగాను రెండు మోటార్లు పాడయ్యాయి. దీంతో నీటి సమస్య తలెత్తింది. అందులోనూ ఈనెల 17నుంచి షేర్‌పల్లి వద్ద లైన్ మరమ్మతుల కారణంగా మిషన్ భగీరథ నీటి సరఫరాకు నోచుకోలేదు. రెండు కారణాలతో పది రోజులుగా మున్సిపాలిటీలో నీటిసరఫరా అంతంత మాత్రంగా కొనసాగుతోంది. నిత్యం 10ఎంఎల్‌డీల నీటి సరఫరా కావాల్సి ఉంది. కేవలం 3ఎంఎల్‌డీల నీరు సరఫరా అవుతుంది. కొన్ని కాలనీలకు మాత్రమే నీటిని పంపిణీ చేస్తున్నారు. ఆదివారం 26వ వార్డులో నీటి ఇబ్బంది కారణంగా డేవిడ్ అనే వ్యక్తి ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేశారు. సగం ట్యాంకర్‌ను కాలనీవాసులు పట్టుకునేందుకు వదలటంతో నీటిని పట్టుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు బిందెలతో తరలివచ్చారు. కొంతకాలంగా ఇలాంటి దృశ్యాలు కనబడలేదని, మళ్లీ మొదలయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు.

మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో..

మున్సిపాలిటీ పరిధిలో 27 వార్డులు ఉండగా 6, 7, 11, 12, 13, 21, 26 వార్డులతో పాటు మిగిలిన వార్డుల్లోని కొన్ని కాలనీల్లో నీటి సమస్య అధికంగా ఉంది. పై వార్డులు, కాలనీల్లో పదిరోజులుగా నీటి సరఫరా కావటంలేదు. సమస్యపై కౌన్సిలర్ల కు, మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదుచేసినా సరైన సమాధానమివ్వలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కొరవడిన సమన్వయం

కొద్దిరోజులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై కౌన్సిలర్లు నిమగ్నం కావటంతో అధికారులు, పాలకుల మధ్య సమన్వయం కొరవడింది. నీటి సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను పట్టించుకునే వారు కరువయ్యారని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్ సమీక్ష

మున్సిపాలిటీలో నెలకొన్న నీటి సమస్యపై కలెక్టర్ విజయేందిరబోయి ఆదివారం సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్ సమీక్షలో పాల్గొని సమస్యను వివరించారు. షేర్‌పల్లి వద్ద మరమ్మతుల కారణంగా ఈనెల 17 నుంచి నాలుగు రోజుల పాటు నీటి సరఫరా చేయలేకపోయామని భగీరథ అధికారులు ఆమెకు వివరించారు. మల్లెబోయిన్‌పల్లి పంప్‌హౌజ్‌లో మోటారు కాలిపోయిన విషయాన్ని తెలియజేశారు. పంప్‌హౌజ్ ద్వారా కాకుండా ఇతర మార్గాల ద్వారా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాడయిన మోటర్లను వెంటనే బాగుచేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమస్య పరిష్కారం కోసం చర్యలు

నీటి సమస్య ఉన్నది వాస్తవమే. మిషన్ భగీరథ అధికారులతో కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పాడయిన మోటర్ మరమ్మతు చేసినా మళ్లీ పాడయ్యింది. దానిని మళ్లీ బాగు చేయించాం. పంప్‌హౌజ్ ద్వారా కాకుండా ఇతర మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసేలా చూస్తున్నాం.

● లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల

మళ్లీ పాడవటంతో..

మల్లెబోయిన్‌పల్లి వద్ద పాడయిన మోటర్‌ను శనివారం మరమ్మతు చేశారు. గంట తరువాత మళ్లీ పాడవటంతో ఇబ్బందులు రెట్టింపుయ్యాయి. ఆదివారం మరోమారు మోటర్ మరమ్మతు చేసి నీటి సరఫరాను పునఃరుద్ధరించారు. అయినా మున్సిపాలిటీలో అన్నివార్డులకు నీటి సరఫరా చేసేందుకు రెండు మూడు రోజులు పట్టే అవకాశాలున్నాయి.



మల్లెబోయిన్‌పల్లి వద్ద పాడైన మోటార్

వింటూ.. ప్రశ్నిస్తూ



జడ్చర్ల : అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై వివరిస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు

- విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధిహామీ, ఐకేపీలపై గ్రామసభలో సమీక్ష
- సమస్యలను ఉన్నతాధికారులకు వివరిస్తామని గ్రామస్తులకు హామీ

జడ్చర్ల టౌన్: శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆదివారం మండలంలోని పోలేపల్లిలో సందర్శించింది. గ్రామంలో తిరుగుతూ కొనసాగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకుంటూ సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటిరోజు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పారూల్‌సింగ్ (ఐఈఎస్) ఢిల్లీ, ఆదిత్యరాజ్ (ఐఆర్ఎస్) ఉత్తర ప్రదేశ్, యశ్ సురేకుమార్ కాలె (ఐఎఫ్ఓ) మహారాష్ట్ర, హరిప్రశాంత్ (ఐపీఎస్) తమిళనాడు, మాన్సి రాజీవ్ గోఖలే (ఐసీఎల్ఎస్) గుజరాత్ పాల్గొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, ఐకేపీ, ఐసీడీఎస్ శాఖలపై సమీక్షించారు. ఆయా శాఖల సిబ్బంది గ్రామంలో కొనసాగుతున్న పథకాల గూరించి వివరించారు. వివిధ పథకాలతో లబ్ధి పొందిన వారితోనూ మాట్లాడారు. పీఎం కిసాన్ పథకం ద్వారా గ్రామంలో 1,600 మంది రైతులు లబ్ధిదారులు పొందుతున్నారని.. ఏటా రెండు పర్యాయాలు రూ.2 వేలు అందుతున్నాయని తెలిపారు. గతేడాది వరకు 2,400 మంది రైతుబంధు ద్వారా లబ్ధి పొందారని ఏఈఓ శారద వివరిస్తుండగా.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వచ్చిందని.. ఇప్పుడు రాలేదని నినదించారు.

గ్రామ సమస్యలపై దుమారం

గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, చాలా రోజులుగా రావడం లేదని, పైప్‌లైన్ పాడైనా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు చెప్పడంతో కొద్దిసేపు దుమారం చెలరేగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, బాలామృతం ఇవ్వడం లేదని మండిపడ్డారు. పోలేపల్లి తండాలో రోడ్డు, నీరు, విద్యుత్ సమస్యలతో పాటు కాలుష్యం సమస్య ఉందని తండాకు చెందిన సునీత బృందం వెల్లడించింది. ఉపాధి పనులు చేసినా కూలి డబ్బులు రావడం లేదంటూ యాదమ్మ, బాలమ్మ వివరించారు. అధికారుల బృందం సమస్యలను క్షుణ్ణంగా వింటూ తహసీల్దార్‌ను అడిగి వివరాలు సేకరించారు. సమస్యలను నమోదు చేసుకున్నామని.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గ్రామస్తులకు తెలియజేశారు. సీఐ ఆదిరెడ్డి, పంచాయతీకార్యదర్శి లక్ష్మీనారాయణ, అధికారులు, సిబ్బంది మాలతి, చంద్రకళ, వెంకట్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మాల్యానాయక్, సుగుణ, ఫాతిమాతో పాటు బాదేపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో ఆదివారం సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం అభివృద్ధి పనులను పరిశీలించింది. నర్సరీలు, పార్కులు పరిశీలించారు. పంచాయతీ ద్వారా చేపట్టిన పథకాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు వివరిస్తాం..

గ్రామసభలో తెలుసుకున్న విషయాలు, సమస్యలు అన్నింటిని ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారానిక్రి ప్రయత్నిస్తామని బృందం సభ్యుడు, ట్రైనీ ఐపీఎస్ హరిప్రశాంత్ తెలిపారు. గ్రామసభలో మాట్లాడిన ఆయన సభ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నామన్నారు. మూడురోజుల పాటు గ్రామంలో పర్యటించి మరిన్ని విషయాలు అధ్యయనం చేస్తామని తెలిపారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బృందం సభ్యులకు ఘన స్వాగతం పలికారు. సభ అనంతరం సభ్యులను శాలువా, పూలమాలతో సత్కరించారు.

అద్దెకు ఇచ్చేటప్పుడు వివరాలు సేకరించాలి

- అదనపు ఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ క్రైం: ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు విసదరు వ్యక్తుల వివరాలు తప్పక సేకరించాలని అదనపు ఎస్పీ రాములు అన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖలీల్ చౌక్, ఫైర్ స్టేషన్ ఏరియాలో కార్డెన్ అండ్ సెర్చ్ ద్వారా ఇళ్ల తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇళ్లు పరిశీలిస్తూ ఆయా ఇళ్లలో నివాసం ఉంటున్న వారి ఆధార్, ఇతర స్థానిక ధృవపత్రాలు పరిశీలించారు. మొత్తం 152ఇళ్లు తనిఖీ చేయగా ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా ఉన్న 75ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఒక కారును గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సీఐ అప్పయ్య, ఎస్ఐ శీనయ్య పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

పార్ట్ టైం అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల ఇంటర్ గురుకులాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన కళాశాలల్లో పనిచేసేందుకు పార్ట్‌టైం అధ్యాపక పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్సీఓ కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చ ర్ల, మన్ననూర్, కల్వకుర్తి, అచ్చంపేట, వనపర్తి, కేటీదొడ్డి, కొండాపూర్ గురుకులాల్లో 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు అభ్యర్థులు ఈనెల 26న తిరుమలహిల్స్‌లో ఉన్న ఆర్సీఓ కార్యాలయంలో నిర్వహించే డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్
- మైనార్టీ బాలికల గురుకులాల తనిఖీ

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మూడు మైనార్టీ బాలికల గురు కుల పాఠశాలలను ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూం, వంటశాలలను పరిశీలించారు. వంట చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటగది స్టోర్ రూం, వంటలు చేసే స్థలంలో ఎప్పటికప్పుడూ పరిశుభ్రత చర్యలు చేపట్టి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శంకరాచారి, ఆర్ఎల్‌సీ ఖాజాబావుద్దీన్ తదితరులు ఉన్నారు.



నూనె ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

ఎకరాకు రూ.లక్ష పంట రుణాలివ్వాలి

జడ్చర్ల: పంట రుణాలను ఎకరాకు రూ.లక్ష ఇవ్వా లని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన జీపుజాతా విజయంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కళాజాతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆర్‌అండ్ఆర్ పరిహారాన్ని పెంచాలని కోరారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీమయ్య, ఏఐటీయూసీ నాయకులు కృష్ణయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్వాల్‌రెడ్డి

పథకాలపై కళాజాతా

గండేడ్/మహమ్మదాబాద్: ప్రభుత్వ పథకాలపై కళాజాతా బృందం ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం గండేడ్ మండల కేంద్రంతో పాటు మహమ్మదాబాద్ మండలంలోని జూలపల్లి, గాధిర్యాల్ గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈకార్యక్రమం చేపట్టారు. ఆరు గ్యారెంటీల్లో ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చిన వాటి పై పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఎంపీడీఓ దేవన్న మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.

మహాధర్నాను జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేద్దామని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం నాయకులు ఈర్లపల్లి యాదయ్య, మేకల నర్సింహులు, సత్యం, శ్రీశైలం, బుచ్చయ్య, రామచంద్రయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మిక సమస్యల పరిష్కారం కోసం..

మహమ్మదాబాద్: కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న చేపట్టే మహాధర్నాకు సీఐటీయూ, సీపీఎం నాయకులు, కార్మికుల తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కార్మికుల జనరల్‌బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని..

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పే కేంద్ర ప్రభుత్వం ఈనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాధర్నాలో పాల్గొనాలని ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ మైదానం సమీపంలో, రైల్వే స్టేషన్ ఏరియాలలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ నాయకులు బాబుమియా, రాజు, నగేశ్ పాల్గొన్నారు.

ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 26న నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు 26వ తేదీ ఉద యం 10.30గంటలకు మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి ప్రదర్శనగా తెలంగాణ చౌరస్తా వరకు వచ్చి మహాధర్నాను నిర్వహిస్తారని తెలిపారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న హోటల్ గల్లీ నుంచి ప్రేమ్‌నగర్ చౌరస్తా వరకు అలాగే కమలానెహ్రూకాలనీ, అరబ్‌గల్లీలో పర్యటించారు. పలుచోట్ల కాల్వలు, రోడ్లన్నీ దెబ్బతిన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి ర్యాంపులు నిర్మించారని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వీలైనంత త్వరగా డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తామని, అడ్డుగా ఉన్న ర్యాంపులను సైతం తొలగింపజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీడీగుట్ట (వార్డు నం.45) సమీపంలో నిర్వ హించిన కార్తీకమాస బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే ఇండియా సీనియర్ కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా విభాగాల్లో జాహ్నవి, లోకేష్, అక్షయని, సంయుక్త బంగారు పతకాలు, ఆద్య, రితిక, లోహితాస్య, కౌశిక్, హర్ష రజత పతకాలు సాధించారు. విద్యార్థులను జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ చీఫ్ కృష్ణయ్య అభినందించారు. ఇలియాజ్‌బిన్‌సిద్దిఖ్, శివకుమార్, నవీన్‌కుమార్ ఉన్నారు.